# అశ్రుతర్పణం

**'పద్మ - నరేశ్'**

(గతసంచిక తరువాయి)

నాగేష్, సుందరిల స్నేహం నానాటికి జాస్తి కాజొచ్చింది. నాగేష్ నివురుగప్పిన నిప్పని పాపం సుందరికేం తెలుసు! సుందరికి నాగేష్‌లో ఏదో క్రొత్తదనం గోచరించింది. తన హృదయ ఫలకం మీద నాగేష్ ఆకృతిని చిత్రించుకుంది. అహో రాత్రాలు అతనికోసం పరితపించేది. అతనికీ తనకూ చాలా దగ్గరి సంబంధం ఏర్పరచుకుంది సుందరి. అప్పుడప్పుడు యిద్దరూ ఏకాంత ప్రదేశంలో కలుసుకొని ఏవేవో మాట్లాడుకొనేవారుకూడా.

ఓనాటి సాయంత్రం యిద్దరూ చెరువుగట్టున కలుసుకున్నారు. సుందరి నాగేష్ ఒడిలో చేరి ఏవో మాటలు చెప్తోంది. "నాగేష్! మనమెప్పుడు యిలాగే వుంటే ఎంత హాయిగా వుంటుంది." ఆ మాటలు నాగేష్ హృదయాన్ని కలవరపరిచేయి. అతని ముఖ వైఖరి మారింది.

సుందరికి వెంటనే సమాధానం రాకపోయేటప్పటికి అతని ముఖంలోకి చూచింది. "ఏమండీ! అలా వున్నారేం?"

"అబ్బే ఏమీలేదు!" అంటూ తప్పించుకున్నాడు నాగేష్.

"నాగేష్! ఈ చీర ఎలావుందో చెప్పు."

"బాగానే వుంది."

"నాకు గులాబీ రంగు చీరలంటే యెంతో యిష్టం."

"అలాగేం!"

"నాకామాదిరి చీర ఒకటి తెచ్చిపెట్టరూ!" ఎంతో ప్రియంతో అడిగింది సుందరి.

"తప్పక సుందరీ! నాకూ గులాబీ పూలంటే చాలా యిష్టం-"

"నీవీ చీరరంగులో రత్నంలా..." అంటూ ఆతడ బడ్డాడు. సుందరది గమనించింది. "చూడు నాగేష్! నా కళ్లల్లోకి చూడూ! నాకంటే అందంగా వున్నవారెవరయినా నీ హృదయంలో మెదలుతున్నారా?"

"లేదు. సుందరీ లేదు!" నాగేష్‌లో తొందర జాస్తయింది. మెల్లగ సర్దుకున్నాడు. "ఆనాడు రాత్రి నీవు తడిసివస్తే నీలో నాకేదో క్రొత్త అందం గోచరించింది. ఆనాడే నీ అందాన్ని ఆస్వాదించాలనుకున్నాను. ఆనాడే నా హృదయంలో నీ చిత్రాన్ని చిత్రించుకున్నాను." సుందరి అతని మెడ చుట్టూ చేతులువేసింది. నాగేష్ ఆమెను తనహృదయానికి అదుముకున్నాడు.

నాగేష్ మాటలకు సుందరి యెంతగానో ఆనందించింది. అతని మోసపు మాటలకు యెంతగానో మోసపోయింది.

సుందరి తల్లి ఎలిమెంటరీ స్కూలులో టీచరు. ఆమె ప్రొద్దున పదిగంటలకు పోతే తిరిగి సాయంత్రం అయిదుగంటలకు వస్తుంది. తండ్రి చిన్ననాడే జీవితాన్ని చాలించాడు. తమ్ముడొకడున్నాడుగానీ బడుద్ధాయిలా వూరుతిరిగేవాడు. ఫిఫ్త్ ఫారంలోనే మూడు మాట్లు కూర్చున్న ఘనుడు.

ఒకనాడు మధ్యాహ్నం సుందరి స్కూలుకి ఎగ్గొట్టి ప్రియునిరాకకై నిరీక్షిస్తూ కూర్చుంది. దురదృష్టవశాత్తు ఆమె తమ్ముడి కోసం రత్నం ఆయింటికొచ్చాడు. సుందరి లేదని జవాబు చెప్పడంతోటే వెను తిరిగి గడపదిగ పోతూంటే నాగేష్ యెదు

రయ్యాడు. రత్నంని చూడటంతోటే నాగేష్‌కి గుండెలాగినంత పనయింది. నాగేష్ చేతిలోవున్న పొట్లాన్ని చూచి "ఏమిటి నాగేష్! ఆ పొట్లం? ఏమిలా వచ్చావే?" అంటూ చేతిలో పొట్లం తీసుకోబోయాడు.

'అబ్బే ఏమీలేదు!' అంటూ పొట్లం వెనక్కి లాక్కుంటూ "నువ్వేం యిలా వచ్చావు?" అంటూ ఎదురు ప్రశ్న వేశాడు.

"నేను యీ యింట్లో వుండే అబ్బాయికోసం వచ్చాను. వాడు మా క్లాసు మేటులే!" అన్నాడు రత్నం.

"నేను యీ యింట్లో వుండే మేష్టారమ్మకోసం వచ్చాలే." అంటూ రంగు ఫిరాయించాడు. "నాగేష్ ఉండు యీ పొట్లం యిచ్చేసి వస్తాను. అంటూ లోపలకెళ్లాడు నాగేష్ తన దురదృష్టాన్ని తలంచుకొంటూ. కాసేపట్లో బయటికిరాగానే రత్నం, నాగేష్ కలిసి అలా బయలుదేరి పోయారు.

6

నాగేష్ తండ్రి ముకుందరావు. పేరుబడిన సర్కిల్ యిన్స్‌పెక్టరు. ముకుందరావుకు తాత ముత్తాతల ఆస్తి బాగా వుండటంవల్ల హాయిగా కాలం గడుపుతున్నాడు.

"నాగేష్! యిలారా ఓసారి!" కాసేపటికి నాగేష్ అతని ప్రక్కన నిలుచుకుని,

"ఏం నాన్నగారు! పిలచారే!" అతనిత్తట్టు ముకుందరావు కళ్లద్దాలనుంచి చూచాడు.

"చూడు ఈ ఫోటో బాగుందా?" అని ఓ యువతిఫోటోను చేతికిచ్చాడు. నాగేష్ దాన్ని యిటూ అటూ త్రిప్పి,

"దేనికి నాన్నగారూ?"

"చెప్పరా! బాగుందా లేదా?"

"దానికేం బాగుంది."

'ఏది-ఫోటో నా కేక దానిలోవుండే అమ్మాయా?' ముకుందరావు గట్టిగా నవ్వాడు. నాగేష్‌కు వింత గొల్పింది.

"అన్నీ బాగున్నాయి నాన్నగారూ!"

"నిజమే నిజమే దేనికి బాగుండదూ! ఇంతకూ దేనికో తెలుసా! ఇంకో రెండునెలలకు నీకు వివాహం జరిగిపోతుంది."

నాగేష్ హృదయం తక్కున ఆగిపోయింది. తన కిప్పుడు వివాహమా? అదెలా సాధ్యమౌతుంది!

"నాకెందుకు నాన్నగారూ! ఇంత తొందరలో పెళ్ళి! పరీక్ష పాస్ కానీండి."

"నిజమే! నిజమే! నీకు పెళ్లి దేనికిరా? అక్కడా యిక్కడా బడుద్ధాయిలా తిరగమంటే! హూ! ఏరా! నీకు పెళ్లి దేనికొద్దురా? ఇలా గాడిద మోస్తరు పెరిగిపోతుంటే యితరులేమనుకొంటారు?"

"ఇతరులేమనుకుంటే మనకు దేనికి? నాకిప్పుడు పెళ్లి వద్దు! అంతే!"

"నిజమే! నిజమే! యితరులేమనుకుంటే నీకు దేనికి? పిచ్చివాడు! ప్రపంచానికి నోరెంతో తెలుసా! ఈ లోకమంత! అందులో నీవెంతో! నీవూ ఒక సూక్ష్మ జీవివే! ఇక లోకం నోరు మూయదానికి నీవెవరో? ఇకనయినా పిచ్చిమాని నీ స్నేహితులతో చర్చించి, ఆ మీదటే చేసుకోవోయి. ఆ! యిక వెళ్లు."

నాగేష్‌కు నెత్తిన పిడుగుపడ్డట్టయింది. తనకిప్పుడు యిరవైయ్యో యేడు దాటుతుంది. గడ్డాలు, మీసాలూ బాగా వచ్చాయి. తనకూ పెళ్లి చేసుకోవాలని యిష్టమే. కానీ యిది సమయంగా తోచ లేదు నాగేష్‌కు. అందుకనే తనకిప్పుడు వద్దన్నాడు.

ఇతని పెళ్లి విషయం అందరికీ తెలిసి పోయింది. కొందరు చేసుకోమన్నారు. కొందరు అప్పుడే యేం తొందరన్నారు. మరికొందరు నీ యిష్టం అన్నారు.

కానీ నాగేష్ మటుకు యిప్పుడు పెళ్లి చేసుకో కూడదనుకున్నాడు,

## 7

ఓ నాటి సాయంత్రం రత్నం, మూర్తి బజారులో కలుసుకున్నారు. మాటల్లో నాగేష్ సుందరి యింటికి వచ్చిన విషయం గురించి చెప్పాడు రత్నం మూర్తికి.

"సుందరి ! ఆమె యెవరు ?" అన్నాడు మూర్తి ఆశ్చర్యంతో. రత్నం తనకో స్నేహితుడున్నాడని ఆ అబ్బాయి అక్కే సుందరని, ఆ అమ్మాయి ఫిఫ్త్ ఫారం చదువుతూవుందనీ, చూడబోతే సుందరికీ నాగేష్‌కీ ఏదో సంబంధం వున్నట్టుగా తోస్తుందని చెప్పాడు రత్నం. మూర్తికి నాగేష్ మీద కొంత అనుమానంకలిగింది. గీతను నాగేష్ కాలదన్నడంలో ఏదో కొంతకారణం వున్నదనుకొన్న ఆలోచన నేడు రూఢి అయింది. బహుశా సుందరి నేమైనా వలలో వేసుకున్నాడేమో నాగేష్. రత్నంతో నాగేష్‌ను కాస్త గమనించి వుండమని చెప్పాడు మూర్తి. నాగేష్ చేసినపనికి ఎంతో నొచ్చుకొన్నాడు రత్నం.

మూర్తి నాగేష్‌తో మాట్లాడుదామని నాగేష్ యింటిత్రోవ పట్టాడు. రత్నం తనకు పనివుందని అతిజరూరుగా వెళ్లాలని పట్టుపట్టడంవల్ల మూర్తి అతన్ని వదలక తప్పలేదు. మూర్తి నాగేష్ యింట్లో ప్రవేశించేటప్పటికి ముకుందరావు బయట వరండాలో కూర్చొని చుట్ట కాలుస్తున్నాడు. మూర్తి ఆయనవద్దకు పోయి "ఏమండీ నాగేష్ వున్నాడా యింట్లో ?" అన్నాడు. "ఇంట్లోలేడే. ఏంపనేమి టోయ్ యిలావచ్చావు. దారి తప్పినట్లున్నావే!" అన్నాడు ముకుందరావు నవ్వుతూ. "ఊరికే నే పొద్దు పోకవచ్చాను. ఎక్కడికి పోయినాడేమిటి?"

"మావాడిని చూడటానికి తెలిసినవాళ్లొచ్చారు, వాళ్లీ రోజు వూరికి వెళ్తూంటే స్టేషను వరకు సాగనంపబోయాడులే ! వస్తాడు కూర్చో — ఇంతకూ బాగా చదువుకుంటున్నావా ?" ప్రశ్నించాడు ముకుందరావు.

"నాగేష్‌ను చూడ్డానికా ! దేనికీ ?" మూర్తి ఆశ్చర్యంతో అడిగాడు.

ముకుందరావు నవ్వి "ఇంకా తెలియదటోయ్ ! వయసొచ్చిన వాళ్ళయి పోతిరి మీరు. ఇంక పెళ్ళి వ్యవహారాలు వుండలేదటయ్యా !" ఈ మాటలతో మూర్తి నిర్జీవుడయ్యాడు. ముకుందరావు వద్ద శలవు పుచ్చుకుని యింటిత్రోవ పట్టాడు.

నాగేష్‌కి పెళ్లా ! గీత గతేంకావాలి ? అసలీ సుందరెవరు ? స్కూల్లో ఎప్పుడూ చూచినట్లులేదే ! ఇప్పుడు ఏంచేయాలి ? నాగేష్ తండ్రికి నాగేష్ విషయం చెప్పాలనుకున్నాడు. కానీ అది అతని భవిష్యత్తుకు తీరని మచ్చ యేర్పడుతుందేమోనని భయపడ్డాడు. గీతకు ఈ విషయం తెలుపుదామా ? వద్దా ? అని సందేహించాడు.

చివరికీవిషయం గీతకు చెప్పాలని నిశ్చయించుకున్నాడు. చెప్పాడు కూడా. గీత ఒక్క పెట్టున పెద్దగా యేడ్చింది. అసలే కృంగి కృశించి పోతున్న గీత తలమీద పిడుగుపడ్డట్టయిందియీ వార్త వలన. లక్ష్మి అనేక విధాల ఓదార్చింది. మూర్తి గీతకు ధైర్యం చెప్పి నాగేష్‌ను ఎలాగయినా నీవాడినిగా చేస్తానని మాటయిచ్చి బయలుదేరాడు.

ఎలా చేస్తాడు ? అసలు నాగేష్ వొప్పుకుంటాడా? ఇంతకు సుందరి ఎలాంటి స్త్రీయో ? సుందరితో మాట్లాడితే - అసలు ఏమని మాట్లాడాలి ? ఒకవేళ గీత విషయం సుందరికి తెలిపితే తన మిత్రుడు నాగేష్‌ను హీనంగా చూడదూ ? అని పరిపరి విధాలుగా ఆలోచించాడు. చివరకు సుందరితో ఎలాగయినా మాట్లాడాలని నిర్ధారణ చేసుకున్నాడు మూర్తి.

♦ ♦ ♦

ఆనాడాదివారం మూర్తి సుందరి యింటికి వెళ్ళాడు, మిత్రుడు రత్నం చెప్పిన గురుతులబట్టి. లోపల సుందరి యేదో పుస్తకము చదువుకుంటూ

వుండి మూర్తినిచూచి "ఎవరండీ మీరు ? " అని ప్రశ్నించింది.

"సుందరిగారెవరండీ ?"

"నేనే - ఏంకావాలి ?"

"మీరేనా ? అయితే మీతో ఒక ముఖ్యవిషయం మాట్లాడాలి"

"నాతోనా ! అసలు మీరెవరు ?"

"నాపేరు మూర్తి లెండి ! నాగేష్ స్నేహితుడ్ని"

నాగేష్ పేరు వినగానే సుందరి ఆశ్చర్య పడింది. దేనికో బెదురుతూ మూర్తి వైపు చూచింది. మూర్తది గమనించకపోలేదు.

"సరే ! రండి !" అంటూ తన రూంలోకి తీసుకుపోయింది మూర్తిని.

"మీతో నాగేష్కు స్నేహం వుందటగా !" సీరియస్‌గా అడిగాడు మూర్తి.

"దాంతో మీకేం సంబంధం ? అసలా విషయం మీకెందుకు ?" కోపంతో అడిగింది సుందరి.

"క్షమించండి ! మీరు కోప్పడి లాభంలేదు. మీమేలు కోరి మీకు మంచి చేయడానికే వచ్చాను. పిలవని పేరంటంలా వచ్చానని మీరు అనుకుంటున్నారు గదూ ! మీరేమనుకొన్నా ఫరవాలేదు. మీతోపాటు మరో జీవి నాశనంకావడం నా కిష్టంలేదు. మీరు నిజంగా సహృదయులైతే మీ జాతిమీద గౌరవాభిమానాలున్నట్లయితే యీస్వార్థం విడనాడి ఒక జీవిని బాగుపడ చేయ దల్చుకుంటే నామాటల్ని వినండి. ముల్లు పోయి అరిటాకుమీద పడ్డా అరిటాకు వచ్చి ముల్లు మీద పడ్డా అరిటాకుకే మోసం." అని ఆవేశంతో పలికాడు మూర్తి.

సుందరి నిశ్చేష్టితియయింది. "ఇంతకూ మీరసలు సంగతి చెప్పలేదు. అనవసరంగా ఆగ్రహపడడం మంచిది కాదేమో !" అంది నవ్వుతూ సుందరి. మూర్తి సిగ్గుపడ్డాడు.

"అకృత్యమైన కార్యాలు ఆవేశాన్ని కలిగిస్తాయి అనే విషయం మీకు తెలిసే వుంటుంది. ఏమీలేదు. మీరు ఏమీ అనుకోకుండా వుంటే మిమ్మల్ని ఓ మాట అడుగుతాను. మీకు నాగేష్ మీద ఏలాంటి అభిప్రాయం వుందో తెలుసుకోవచ్చా ?"

"అలా అడగడంలో మీ అభిప్రాయం ? " అని సూటిగా ప్రశ్నించింది సుందరి.

"నాగేష్ విషయం మీకు ఏమీ తెలియదని మీరు పలికిన పలుకులే తెలుపుతూన్నవి. నాగేష్కు గీతారత్నం అనే స్నేహితురాలువుందని మీకు తెలుసా ?" అంటు సుందరి కండ్లలోకి చూచాడు మూర్తి.

"సుందరి ఆశ్చర్య పోయింది. ఆ అమ్మాయి ఎస్. ఎస్. ఎల్. సి. కదూ చదువుతూంది."

"అవును. మీకు తెలుసా ఆమెను ?"

"తెలుసుకానీ అంత పరిచయం లేదు."

"కాండవచ్చు. ఆ అమ్మాయి నాగేష్ను ఎన్నడో ప్రేమించింది. నాగేష్కూడా ఆమె అందాన్ని చవిచూచాడు. ఇప్పుడు నీవు దొరికావు. ఆ అమ్మాయి బ్రతుకు నాశనమయింది."

"అంటే"

"అర్థమవడంలేదా ? నాగేష్ నీవలలోపడి ఆమెను వదిలేశాడు. ఆమె బావురుమంటోంది."

సుందరి కండ్లలో నీళ్లు తిరిగాయి. ఆమెమీద దురభిప్రాయాన్ని కలిగివున్న మూర్తి ఆమె కంటి నీరును చూచి ఆశ్చర్య పోయాడు.

"మిమ్మల్ని బాధపెట్టిందానికి క్షమించండి."

సుందరికి నాగేష్ మీద చాలా కోపంవచ్చింది. రేపు తన బ్రతుకూ యింతేనేమో ! అందంగా వున్న స్త్రీ మధువును గ్రోలడమేనా యతని పని ? ఛీ ! ఈ మగజాతినే నమ్మకూడదు. ప్రశాంత పూరితమైన ఆ ముఖంలో ఎన్ని విషచ్ఛాయలలుము కొని వున్నాయి ! "మూర్తిగారూ ! నాగేష్ సౌందర్యాతిశయములో నిద్రబోతూ మునిగి

తేలుతూవున్న నన్ను మేలుకొలిపారు. ఈ నాడు ఆమెగతి ఎలా అయిందో రేపు నాగతి అంతేకాబోతుంది. నాగేష్‌కు యీ నాడే బుద్ధిచెప్పి తిలోదకాలిస్తాను.”

మూర్తికి పరమ సంతోషమయింది. ఆమె తన కిచ్చిన సహకారానికి యెంతో పొంగి పోయాడు. ఆమె నభినందించి, గీత యింటి త్రోవపట్టాడు, మూర్తి.

## 8

గీత నాగేష్ చేత తిరస్కరింప బడినప్పటినుండి యేదో తెలియని మనోవ్యాధితో సగమయి పోయింది. తను బతికి పోతున్నదనే కానీ, అందులో యేమంత వుత్సాహం గోచరించేదికాదు.

బడిలో అప్పుడప్పుడు నాగేష్‌ను చూచేది గీత. అతన్ని చూచినప్పుడల్లా తనకళ్లల్లో నీళ్లు తిరిగేవి. అతని తట్టు జాలిగా చూచేది. కానీ నాగేష్ గీత తట్టు చూచేవాడు కాదు.

లక్ష్మి మూర్తిని యెన్నిమార్లో కలుసుకుంది. అతనితో యేవో మాటలు చెప్పేది.

లక్ష్మి మూర్తిని చూచినప్పుడల్లా యేదో తెలియని ఆనందాన్ని అనుభవించేది. అతనితో మాట్లాడాలంటే యెంతో వుత్సాహం చూపేది.

మూర్తి గూడా లక్ష్మిని చూచినపుడు యెంతో అభిమానం చూపేవాడు. లక్ష్మితో యిన్నాళ్లూ కలిగిన ప్రేమానురాగాలు మూర్తి స్నేహంతో వుద్భవించాయి.

లక్ష్మి మూర్తి కలుసుకుని యేవేవో మాట్లాడుకోటవటం యిద్దరూ కలిసిమెలసి వుండటం పలుమార్లు చూచింది గీత.

ఆ దృశ్యాలు చూచేటప్పుడు గీత హృదయం తపించి పోయేది. వారిద్దరూ అన్యోన్యంగా వుండడంచూచి సహించలేక పోయింది.

మూర్తి యెవరు? నాగేష్ ముఖ్యస్నేహితుడు. నాగేష్‌తన్ను మోసంతో అన్యాయంచేశాడు. తన జీవితం సర్వ విధాలా భ్రష్టు చెందింది. సంఘంలో తనకిప్పుడు స్థానంలేదు. తను అందరి నోళ్లలోపడి నానింది.

ఆనాడు గీతకు కడుపులో నొప్పి జాస్తయి స్కూలుకు వెళ్లకుండా యింట్లోనే వుండిపోయింది.

తన ఆలోచనలన్నీ ఆ నాడు లక్ష్మిమీద నిలిచి పోయాయి. లక్ష్మిని పిలచింది. లక్ష్మి ప్రక్కన వచ్చి నిలబడింది.

“ఏం లక్ష్మి! నీవు చాల రోజులనుండి నాదగ్గరకు రావడంలేదే?” లక్ష్మికి ఈ ప్రశ్నలోని అర్థం ఏమిటో తెలియలేదు.

(సశేషము)

పాత్రుడు గారి
# బాలసంజీవిని (Regd)
పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును
## డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,
19, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు-4. Phone 71354
కుంభకోణము బ్రాంచి: 1. సారంగపాణి కోవిల, తూర్పువీధి.
అన్ని మందుల షాపులలోను దొరకును.